సమష్టి పోరాటంతోనే హక్కుల సాధన



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

సైదాబాద్: మాల మాదిగలు సమష్టిగా పోరాటం చేస్తేనే రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులు సాధ్యమవుతాయని జాతీయ షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం సెక్రటరీ జనరల్ కె.బాలకృష్ణ అన్నారు. మలక్‌పేట నియోజకవర్గం ఛావుని డివిజన్ నాదర్‌అలీ బేగ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాల మాదిగలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. గత పదేళ్లుగా ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలమాదిగలు కలిసుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో పటేల్ విశ్వప్రకాష్, నాగునూరి కృష్ణ, నారాచణరావు, పటేల్ విజయ్‌కుమార్, తిరుమలరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

అనంతరం నాదర్‌అలీ బేగ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, శివకుమార్, శివశంకర్, కార్యదర్శిగా జయవర్ధన్, కోశాధికారిగా సతీష్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా భగత్ ప్రీతం, సంజయ్, సాయి, అమృత్‌కుమార్, శశాంక్, కిరణ్ కిషోర్ ఎన్నికయ్యారు.

ఎస్సీ వర్గీకరణపై మాదిగల పోరాటం న్యాయమైంది



డప్పుల ప్రదర్శనలో ఎమ్మార్పీఎస్ నాయకులు

మలక్‌పేట: ఎస్సీ వర్గీకరణపై మాదిగలు చేస్తున్న పోరాటం న్యాయమైందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టుదాసురావు మాదిగ అన్నారు. ఈ నెల 7న నగరంలో నిర్వహించనున్న 'లక్ష డప్పులు..వేల గొంతులు' సాంస్కృతిక ప్రదర్శనకు మద్దతుగా మంగళవారం మూసారంబాగ్‌లో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన మాట ప్రకారం వర్గీకరణ చేయాలని, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా వర్గీకరణ చేశారన్నారు. మాల మంత్రుల మాటలకు తలొగ్గి వర్గీకరణలో స్పష్టమైన వైఖరి తేల్చకుంటే కాంగ్రెస్‌కు భవిష్యత్ లేకుండా చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాంచందర్‌మాదిగ, సుదర్శన్, రమేష్, యాదగిరి, సంపత్, రామకృష్ణ, అజేయ్, మోజెస్, జగదీష్, వెంకన్న, వెంకటస్వామి, జలందర్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న క్షమాపణలు చెప్పాలి



తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

మన్సూరాబాద్: రెడ్డి కులంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బేషరతుగా తన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలని రెడ్డి మహిళా సంఘం డిమాండ్ చేసింది. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో మంగళవారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రెడ్డి కులంపై ద్వేషంతో తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు నూకల పద్మారెడ్డి, జక్కా గీతారెడ్డి, ముత్యంరెడ్డి, హరీష్ రెడ్డి, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

చిల్డ్రన్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తాం



కాలనీవాసులతో మాట్లాడుతున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: పీఅండ్‌టీ కాలనీలోని చిల్డ్రన్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.కాలనీ సంక్షేమ సంఘం భవనం సమీపంలో నిరుపయోగంగా ఉన్న చిల్డ్రన్ పార్కు స్థలంలో పార్కు ఏర్పాటులో భాగంగా మంగళవారం జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పార్కు స్థలంలోని పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులలోని ఇరు వర్గాల నడుమ స్వల్ప విభేదాలు రావటంతో కార్పొరేటర్ అక్కడకు చేరుకుని సమావేశం ఏర్పాటు చేశారు. దశాబ్ద కాలంగా చిల్డ్రన్ పార్కు స్థలం నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. ఆ స్థలంలోని సగభాగంలో చిన్నపిల్లకు అవసరైమన ఆట పరికరాలు, మిగిలిన స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఐకమత్యంగా ఉంటేనే కాలనీ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అశోక్‌కుమార్, వేణుగోపాల్, ప్రభాకర్, శ్రీధర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

నోబుల్ డిగ్రీ కాలేజీలో ఎఫ్‌డీపీ

మలక్‌పేట: విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దడానికి అత్యాధునిక బోధన పద్ధతులు దోహదపడుతాయని నోబుల్ విద్యా సంస్థల చైర్మన్ ఆర్.రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని నోబుల్ డిగ్రీ కాలేజీలో మంగళవారం నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బోధనాంశాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడం సత్ఫలితాలను అందిస్తుందన్నారు. శిక్షణ ద్వారా ఆధునిక బోధన పద్ధతుల్లో సాంకేతికత, సమయపాలన, శ్రద్ధ, దీక్ష తదితర అంశాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విఠల్ పార్థసారథి, రాజేష్ పాల్గొన్నారు.

ఉద్యానం.. అధ్వానం



లాన్‌లో పచ్చదనం లేక మట్టి కన్పిస్తున్న దృశ్యం

మలక్‌పేట: ఆహ్లాదం, సేద తీరేందుకు ఏర్పాటు చేసిన పార్కులపై పర్యవేక్షణ లేక అధ్వానంగా మారుతున్నాయి. పచ్చదనంతో కళకళ లాడాల్సిన పార్కులు పిచ్చిమొక్కలతో కళావిహీనంగా మారుతున్నాయి. మూసారంబాగ్ డివిజన్ తేజ్‌నగర్ కాలనీ పార్కుపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో నిరుపయోగంగా మారుతోంది. గతంలో జరిగిన అభివృద్ధే తప్ప..నేడు పార్కు ఆలనా పాలనా కరువైందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. పేరుకుపోయిన చెత్త కుప్పలు, సంరక్షణ లేని మొక్కలు, పార్కు లాన్‌లో కనిపించని పచ్చదనం, కానరాని ఆట పరికరాలు, పారిశుద్ధ్యం కొరవడి ప్రహరీ చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధంగా మారుతోంది. సరైన వాకింగ్ ట్రాక్ లేక సీనియర్ సిటిజన్స్ ఇబ్బందులు పడుతున్నారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో పార్కుకు వచ్చే వారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఉన్నతాధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పార్కు ముందు ఫుట్‌పాత్‌పై వ్యర్థాలు



చెత్త చెదారంతో ఇలా..



నీరులేక వాడిపోయిన మొక్కలు

'డబుల్' దరఖాస్తుల స్వీకరణ

- నేటినుంచే ప్రక్రియ మొదలు
- కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి
- వార్డు కార్యాలయాల్లో సంప్రదించాలని సూచన

హుడాకాంప్లెక్స్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం డివిజన్ వార్డు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తెలిపారు. మంగళవారం నుంచి ప్రతీ డివిజన్ వార్డు కార్యాలయాల్లో అప్లికేషన్లు తీసుకుంటారని, ఇందుకు సంబంధించిన ఫారాలు అందుబాటులో ఉంచాలని వార్డు ఆఫీస్ ఇన్‌చార్జి యాదగిరికి సూచించారు. పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల సాకారంలో భాగస్వాములు కావాలని కోరారు. దరఖాస్తు ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా వెళ్లి అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల జయంతిని పండుగలా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

హస్తినాపురం: తెలంగాణ ఉద్యమకారుల జయంతిని పండుగలా జరుపుకోవాలని మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ఆచారి, కందారి గణేశ్‌చారి పేర్కొన్నారు. హస్తినాపురంలోని కేకే గార్డెన్స్‌లో విశ్వకర్మ 40వ వార్షికోత్సవ కేలండర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. వీర బ్రహ్మేంద్ర స్వామి నుంచి మారోజు వీరన్న వరకు నిరుపేదల పక్షాన నిలబడి ప్రజలకు న్యాయం జరగాలని ఆకాంక్షించారని సబ్బండ వర్గాల కోసం నిరంతరం పోరాడిన ధీరులన్నారు. తెలంగాణ విశ్వకర్మ మనుమయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి మాట్లాడుతూ.. విశ్వకర్మ మనుమయులను విస్మరిస్తే సీఎం రేవంత్‌రెడ్డిని గద్దె దింపుతామని హెచ్చరించారు. విశ్వభగవానుడి వారసత్వం పునికి పుచ్చుకున్న మారోజు వీరన్న, ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంతచారి సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మేడోజు శంకరాచారి, తాటికొండ శ్రీరాములు చారి, సాల్వాచారి, శ్యామల,రేణుక, పరిపూర్ణాచారి, యాదగిరి చారి, నరేందర్‌చారి పాల్గొన్నారు.

సీఎం చొరవతోనే పార్కు అభివృద్ధి



పార్కులో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే ప్రియదర్శిని పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. హెచ్‌ఎండీసీ ఏఈ రంజిత్‌కుమార్‌తో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి రోజు ఈ పార్కుకు చిన్న పిల్లలు, యువత, మహిళలు అధిక సంఖ్యలో వస్తుంటారని, పార్కులో నెలకొన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారన్నారు. పాడైపోయిన ఆట పరికరాల స్థానంలో నూతన పరికరాలు, నూతనంగా ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఉమేష్‌సింగ్, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాలల ఐక్య వేదిక నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో నాయకులు

చైతన్యపురి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపడుతారన్న సమాచారంతో తెలంగాణ మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్, పలువురు నాయకులను మంగళవారం సరూర్‌నగర్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశం జరుగుతున్న నేపథ్యంలో బేరబాలకిషన్‌ను చెరుకుతోట కాలనీలోని ఆయన నివాసం వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ చేసేందుకు ప్రభుత్వాలు కొందరు మనువాదుల కుట్రలకు తలొగ్గుతున్నాయని విమర్శించారు. ఎస్సీరిజర్వేషన్లు ఎత్తివేసేందుకు మాల, మాదిగల నడుమ చిచ్చుపెట్టి తమాషా చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలో పడకుండా ఎస్సీ వర్గాలన్నీ ఏకమై రిజర్వేషన్లు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. నిర్బంధాలతో ఉద్యమాన్ని అణచివేయడానికి చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధ్ధృతం చేస్తామని బేర బాలకిషన్ హెచ్చరించారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సామరంగారెడ్డి



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నాగోలు: పేదలు, మధ్య తరగతి ప్రజలు, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర బడ్జెట్ రూపొందించబడిందని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ అన్నారు. నాగోల్ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం నాగోలు చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేసే విధంగా ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో రూపొందించిన డ్రీమ్ బడ్జెట్ అన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ గౌడ్, ఐలయ్య, సంజీవ రెడ్డి, చంద్రశేఖర్ గుప్తా, శ్యామ్‌కుమార్, చంద్రశేఖర్ రావు, నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

శ్రీరమణకాలనీ వద్ద..

హస్తినాపురం: వికసిత్ భారత్‌లో భాగంగా పేద ప్రజలు, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారని రంగారెడ్డి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ బీజేపీ పార్టీ అధ్యక్షుడు ఎరుకల మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శ్రీరమణకాలనీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సామ రంగారెడ్డి పాల్గొని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, రాజేంద్రప్రసాద్, రాజుగౌడ్, వెంకటేశ్‌గౌడ్, నరేష్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్, గోవర్ధన్‌యాదవ్ పాల్గొన్నారు.

మగ్దూం కవిత్వం విప్లవ ఉద్యమానికి మార్గదర్శకం



మొహియుద్దీన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు

మన్సూరాబాద్: మగ్దూం కవిత్వం విప్లవ ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచిందని, కార్మిక వర్గ హక్కులకు పోరాడిన మహనీయుడని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి పేర్కొన్నారు. సీపీఐ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం హయత్‌నగర్‌లో నిర్వహించిన మగ్దూం మొహియుద్దీన్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత ఆయన పోరాట స్ఫూర్తిని తీసుకుని సామాజిక న్యాయం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామిడి శేఖర్‌రెడ్డి, శేషరాజు శ్రీదేవి, బొంగు అరుణ్ కుమార్‌గౌడ్, మత్రి శోభన్, వంశీవర్ధన్‌రెడ్డి, రామావత్ సత్రు, వెంకట్, గోల్కొండ నాగరాజు, మందుల కృష్ణ, ఇరుగు జ్యోతి పాల్గొన్నారు.

మలక్‌పేట బీజేపీలో తీవ్ర నిరాశ!

- జిల్లా అధ్యక్ష రేసులో ఉన్నా ఎవరికీ దక్కని యోగం
- అంతర్గత పోటీతో చుక్కెదురు



సైదాబాద్: బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్ష పదవికి రేసు ముగిసినట్లే తెలుస్తోంది. పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించకపోయినా జిల్లా అధ్యక్షుడి నియామకం డిసైడ్ అయిందని పార్టీ నేతలే చెపుతున్నారు. బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి జిల్లా అధ్యక్ష పదవికి మలక్‌పేట నియోజకవర్గం నుంచి పలువురు పోటీ పడ్డారు. ప్రధానంగా సైదాబాద్ డివిజన్ నుంచి ముగ్గురు, మూసారాంబాగ్ నుంచి ఓ నాయకుడు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎవరికి వారు తమ గాడ్‌ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమకే పదవి ఖాయమని బలంగా నమ్ముతూ వస్తున్నారు. అయితే చివరికి వారి ఆశలు అడియాశలు అయినట్లు తెలుస్తోంది. భౌగోళికంగా నాలుగు నియోజకవర్గాలు వాటిలోని 27 జీహెచ్‌ఎంసీ వార్డులతో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉంటుంది. మలక్‌పేట, యాకత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా నియోజకవర్గాలు జిల్లా పరిధిలోకి వస్తాయి.

అగ్ర నాయకులతో లాబీ..

గత రెండు పర్యాయాలు కూడా జిల్లా అధ్యక్షుడిగా మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్‌కు చెందిన నాయకుడే వ్యవహరించారు. ఆయన కూడా మరోసారీ తనకే అధ్యక్ష హోదా కావాలంటూ తీవ్రంగానే యత్నించారు. సైదాబాద్‌కే చెందిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రజాప్రతినిధి భర్త అయిన నాయకుడు తనకు అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలతో సంప్రదింపులు జరిపారు. సైదాబాద్‌కు చెందిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడైన బీసీ నేత కూడా పార్టీలో తనకు గురువు లాంటి అగ్ర నాయకుడితో లాబీ చేయించారు. అదే విధంగా మూసారాంబాగ్‌కు చెందిన నేత కూడా అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు తమదైన శైలిలో ప్రయత్నాలు చేసారు.

మలక్‌పేట నేతల మధ్య పోటీ..

మలక్‌పేట నేతల మధ్య పోటీ తీవ్రం కావడంతో పార్టీ అధిష్ఠానం మధ్యే మార్గాన్ని పాటించినట్లు తెలుస్తోంది. ఆచితూచి వ్యవహరించిన అధిష్ఠానం పలు షరతులను చూపి నాయకులను వడ గట్టింది. ఈసారి జిల్లా అధ్యక్ష పదవి బీసీలకు కేటాయించినట్లు పార్టీ ప్రకటించడంతో మలక్‌పేటకు చెందిన ముగ్గురు అగ్రవర్ణ నాయకులకు దారులు మూసుకు పోయాయి. చివరికి బరిలో ఇతర నియోజకవర్గాలతో కలిసి ముగ్గురు బీసీ నేతలు మిగలగా జిల్లాలోని మరో నియోజకవర్గమైన యాకత్‌పురాకు చెందిన బీసీ నాయకుడిని జిల్లా అధ్యక్షుడిగా ఖరారు చేసినట్లు సమాచారం. ఇన్నాళ్లూ తమకే జిల్లా అధ్యక్ష పదవి ఖాయమని ధీమాగా ఉన్న నాయకులు చివరికి ఉసూరుమంటున్నారు. అయితే మలక్‌పేట నుంచి అధ్యక్ష పదవికి పోటీ పడిన నాయకులు ఆ యోగం తమకు దక్కకపోయినా పార్టీలో తమ ప్రత్యర్థులకు కూడా దక్కకపోవటంతో ఒకింత సంతృప్తిగా ఉన్నట్లు ఆయా నాయకుల అనుచరులే గుసగుసలాడుకోవటం కొసమెరుపు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.25, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.11, క్యారెట్ రూ.21, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.21, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.35, చామగడ్డ రూ.40, మునగ రూ.75, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్ రూ.21, కీర రూ.28, బీన్స్ రూ.50, క్యాప్సికమ్ రూ.40. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

మలక్‌పేట మార్కెట్‌లో కాంటా లేదంటా!

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌లో కాంటాపై పాలకవర్గం దృష్టి సారించడం లేదు. పాలకవర్గం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నా కాంటాపై చర్చించినట్లు దాఖలాలు లేవు. అసలే మిర్చి సీజన్ దానికి తోడు ఉల్లిగడ్డల లారీలు వందల సంఖ్యల్లో వస్తుంటాయి. వేబ్రిడ్జ్ లేక మార్కెట్‌కు వచ్చే ఫీజు బయట కాంటాలకు చెల్లించాల్సి వస్తోండటంతో మార్కెట్ ఆదాయానికి గండి పడుతుందని రైతులు వాపోతున్నారు.

23న బ్రాహ్మణ వటువుల సామూహిక ఉపనయన సంస్కారం

వనస్థలిపురం: బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ వనస్థలిపురం వారి ఆధ్వర్యంలో ఈ నెల 23న వనస్థలిపురంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ప్రాంగణంలో బ్రాహ్మణ వటువుల సామూహిక ఉపనయన సంస్కారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోచంపల్లి శ్రీధరరావు, నందిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునేవారు ఈ నెల 20వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని మరిన్న వివరాలకు 63024 54218 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నియామకం



వెంకటేష్

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గం అజంపురా డివిజన్ బీజేపీ పార్టీ అధ్యక్షుడిగా వడ్లగోని వెంకటేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సురేష్‌కు ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ధరవత్ సురేష్

మన్సూరాబాద్: వీల్‌చైర్ బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్టణంలో జరిగిన దివ్యాంగుల వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణ జట్టు చాంపియన్ ట్రోఫీని దక్కించుకుంది. ఈ చాంపియన్ షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును ధరవాత్ సురేష్ అందుకున్నాడు. తనతో పాటు మన్సూరాబాద్ డివిజన్ శైలజాపురి కాలనీలోని దివ్యాంగుల వసతి గృహం విద్యార్థులు శివ, రాహుల్ జట్టు సభ్యులుగా ఉన్నారని సురేష్ వెల్లడించాడు.

విద్యార్థులకు అన్ని కళల్లో ప్రావీణ్యం ఉండాలి



ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభిస్తున్న దిలీప్‌రెడ్డి

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసాయి డిగ్రీ, పీజీ కాలేజీలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. వివిధ రకాల వంటకాలు నోరూరించే రుచులకు కాలేజీ వేదికైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని కళల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. సాంప్రదాయ వంటకాలపై అవగాహన పెంచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాసాచార్యులు, వెంకటేశ్వర్లు, శోభారాణి, మమత పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సాహూ బసంత్

సైదాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సాహూ బసంత్ (65) నగరానికి వలసొచ్చి సైదాబాద్ లక్ష్మీనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద పనికి కుదిరాడు. కుటుంబ సభ్యులతో కలిసి నిర్మాణం వద్దే నివసిస్తున్నాడు. ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లిన బసంత్ ఎంతకీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.